04112024-DIS-04_Layout 1 11/4/2024 3:28 AM Page 1

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

జంగమరత్నంబు శరణ సమ్మతుడు

పాల్కుర్కి ఎప్పటివాడు-2

**'జంగమరత్నంబు శరణ సమ్మతుడు
లింగైక్యవర్తి గతాంగ వికారి
పండితారాధ్య కృపా సముద్ధతుడు
మండిత సద్భక్తి మార్గ ప్రచారి
విలసిత పరమ సంవిత్సుఖాం బోధి
అలి కరస్థలి సోమనాథయ్య గారు'**

అని బసవ పురాణంలో పేర్కొనబడ్డ సోమనాథయ్య నుంచి తాను బసవ పురాణ గాథలు ఏరికొన్నాడు. అతడు తనకు సమకాలికుడు. అతడు పండితారాధ్యుని శిష్యుడేనని చెప్పినాడు. క్రీ.శ.1168లో బసవేశ్వరుడు శివైక్యం పొందగా అతనికి రెండు లేదా మూడు సంవత్సరాల తర్వాత పండితారాధ్యుడు శివైక్యమైనాడు.



ఈతనిని పాల్కుర్కి సోమన చూడకున్నను అతని శిష్యుల ద్వారా బసవని గాథలు తెలుసుకొన్న సోమన క్రీ.శ.1180 ప్రాంతం వాడవుతాడు. అంటే మొదటి కాకతీయ రుద్రుని (గణపతి దేవుని పెద తండ్రి) కాలం వాడే అవుతాడు. బసవ పురాణంలో తన స్నేహితున్ని (కరస్థలి సోమనాథుని) పేర్కొన్నాడు. తన కవితా గురువు కరస్థలి విశ్వనాథ య్యయు ఈతని కంటే పెద్దవాడైన కరస్థలి సోమ నాథయ్యను మాత్రం శిష్యునిగా పేర్కొన్నాడు అన్నది గమనించదగ్గది.

బసవపురాణంలో తన ప్రాణ స్నేహితుని గురించి 'పడగాము రామేశ వర శిష్యుడనగ బడ చెన్న రాముని ప్రాణసఖుండ'

అని ఈ విధంగా పేర్కొన్నాడు. ఈ చెన్నడు కేదారయ్య చిన్న కొడుకు. కనుక సోమనాథుడు పండితరాధ్యునికి చాలా తరముల తర్వాతివాడు (అనగా రెండవ రుద్రుని కాలము వాడు) కాజాలడు.

సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకులు కీ.శే. మల్లం పల్లి సోమశేఖర శర్మ గారు పాల్కుర్కి సోమన కాల నిర్ణ యంలో నీలగంగవర శాసనాన్ని ఉదహరించారు. సహ జంగా మల్లంపల్లి వారి మీద గౌరవంతో కొంత, శాసన ఆధారం కనుక కొంత పునరాలోచించవలసి ఉందను కున్నారు నాటి చరిత్రకారులు. కానీ, దీనిని కూడా తిర స్కరించవలసిందే.

గుంటూరు జిల్లా వినుకొండ తాలూకాలోని నీలగం గవర గ్రామంలో రెండవ ప్రతాపరుద్రుని సామంతుడైన అంబయ దేవుడు వేయించిన శా.శ.1212 అనగా క్రీ.శ.1290 నాటిదీ శాసనం. దీనిలో రెండ్రేవుల మల్లి నాథయ్యకు మొల్ల కల్లూరనే గ్రామాన్ని దానం చేసిన ట్టుంది. దీనిలోని ప్రతి గ్రహీత రెండ్రేవుల మల్లినాథుడు. ఇతడు పాల్కుర్కి సోమనాథుడు పేర్కొన్న రెంటాల మల్లినాథుడని మల్లంపల్లి వారు ఊహ చేసినారు.

'యసలారగా గుమరాద్రికి దూర్పు దెసను సోపానముల్ దీర్చి పొల్వార మహిత సద్భక్త సమంచిత వృత్తి మహిజను రెంటాల మల్లినాథుడును'

అని బసవపురాణంలో పేర్కొనబ డినాడు. ఈ మల్లంపల్లి వారి ఊహను బండారు తమ్మయ్య అంగీకరింప లేదు. పిడుపర్తి బసవన పాల్కుర్కి సోమును, కాకతీయ ప్రతాపరుద్రుని కాలం వాడన్నాడు. ఓరుగల్లు తురుష్కాక్రాంతం అవుతుం దని సోమన చెప్పినట్టు పేర్కొ న్నాడు. సోమనాథుని శిష్యు డైన శివరాత్రి కొప్పయ్యకు మనుమడైన సోమయ్య ప్రౌఢ రాయలచే క్రీ.శ.1430 ప్రాంతంలో డోకిపర్రును తిరిగి పొందెనని రాసికొ న్నాడు. దీన్ని బట్టి సోమనా థుడు రెండో ప్రతాపరు ద్రుని కాలం వాడు అని భావించారు. ఇది సరి కాదు. ఈ రెంటాల మల్లినాథుడు రుద్రుని కాలం వాడే. కనుక సోమన, మల్లినాథులు రుద్రునికాలం వారే. తర్వాత ఈ సోమనామాలు రుద్రమ, ప్రతాప రుద్రుల కాలంలో వీరి సామంతులు తొలుత పునఃనిర్మించి ఉంటారు. ఆ విషయం చరిత్రకెక్కలేదు. దీనికి కిందిది ఆధారం.

అంబదేవ రాజు నీలగంగ వరపు శాసనంలో 'పూర్వ ద్వారే కుమార క్షితభృత్ ఉపరితస్థత్ పురారేః పురస్తాత్ రమ్యం సోపాన మార్గం సుఖకర మమలం...'

అని యిట్లు ప్రస్తావించబడినదీ సోపాన మార్గమే. (యువకుడైన) అంబదేవుడు ప్రతాపరుద్రుని కాలం వాడు. (వృద్ధురాలు) రుద్రమతో (ఆవిడకిది ఆఖరి యుద్ధం) యుద్ధం చేసినవాడు.

ఇలాంటి మరోశ్రీశైల సోపాన పంక్తి నిర్మాణం అద్దంకి నేలిన వేమారెడ్డి చేయించినాడు. ఆ పిదప కీర్తి స్పర్ధతో రాచకొండనేలిన మొదటి అనపోత నాయుడు (1361-1383) సోపానాలు నిర్మించినట్టు ఆయన కుమారుడు సర్వజ్ఞ సింగభూపాలుడు తన రసార్ణవ సుధాకరమున తెలిపినాడు కానీ ఇది సోమనకు అనం తరం కాలం. ఈ సోపాన ప్రస్తావన గల క్రీ.శ.1335 నాటి చీమకుర్తి శాసనం ప్రోలయ వేమునిది. దీనిలో 'శ్రీపర్వత, అహోబల నిర్మిత సోపాన' అని ఉంది. నాడు రాజులు శ్రీశైల సోపాన నిర్మాణం పుణ్యప్రద మని భావించారు.

సోమన ఉమా మహేశ్వరం (నల్గొండ జిల్లా) దేవాలయాన్ని, పరిసరాలయాలను వివరించినాడు. కానీ, క్రీ.శ.1280లో రుద్రమ సేనాని చెరుకు బొల్లయ్య కట్టించిన పంచేశ్వరాలయాలు (ఉమా మహేశ్వ రంలో) పేర్కొనలేదంటే అవి సోమన తర్వాతి నిర్మాణాలుగా భావించవచ్చు.

రెండ్రేవుల రెంటాల అయ్యే అవకాశం లేదని బండారు వారు మల్లంపల్లిని వ్యతిరేకించారు. మల్లంపల్లి వారు ఈ దొరికిన శాసనమును బలవం తంగా ముడిపెట్టి పాల్కుర్కిని రెండో రుద్రుని కాలము వానిగా చేయుటకు చేసినది సాహసమే. రెండ్రేవుల అనేది రెండు రేవుల గ్రామము లేదా తీరపు గుడిసెల ఆవాసానికి పేరు. రెంటాల అన్నది. 'రెండు + అల' పదముల కల యిక. అల అన్నది కన్నడ ప్రభావమున్న కాలమున గ్రామమనే అర్థంలో వాడబ డింది. అనేక తెలంగాణ గ్రామ నామా లకు ఈ అల పేరున్నది. చిట్యాల, చెప్యాల, ఇటిక్యాల, మంచిర్యాల, మల్యాల, జగిత్యాల, నంద్యాల వంటివి ప్రసిద్ధాలు. 'రేవుల నుంచి 'అల' రాలేదు. 'రెండు' తొలి పదము ఇది ఔప విభక్తిక నామ వాచకం. ('రెంటిని', 'రెంటికి చెడ్డ..' 'రెంటియందు' వంటి ద్వితీయాది విభక్త్యంతములలో చూడవచ్చు.) అలతో ఔపవిభక్తికమే సమసించినది తప్ప 'రేవుల' నుంచి వచ్చినది కాదు. నీలగంగ వరపు శాసనస్థ రెండ్రే వుల మల్లినాథుడు సోమన పేర్కొన్న రెంటాల మల్లినా థుడు కాడు. ఇంటిపేర్లు వేరు. రెండు ఊళ్లు వేరు, వేరు. కనుక మల్లంపల్లి వారి వాదము తిరస్కరణీయం.

ఈ రెంటాల మల్లినాథుడు రుద్రుని కాలం వాడే. కనుక సోమన, మల్లినాథులు రుద్రుని కాలం వారే. తర్వాత ఈ సోమనాములు రుద్రమ, ప్రతాపరుద్రుల కాలంలో వీరి సామంతులు తొలుత పునఃనిర్మించి ఉంటారు. ఆ విషయం చరిత్రకెక్కలేదు.

పాల్కుర్కి సోమనాథుని కాలనిర్ణయమునకు పనికి వచ్చు మరొక శాసనం ఉంది. అది పిల్లలమర్రి శాసనం. దీనిని బేతిరెడ్డి భార్య ఎరుక సానమ్మ వేయించినది. కాలం శా.శ.1137 అనగా క్రీ.శ.1215కు సరైనది. శ్రీ ఎరకేశ్వర, బేతేశ్వర దేవరలను ఇవటూరి సోమనా థుడు ప్రతిష్ఠించినాడని దీనిలో రాయబడ్డది. ఈ ఇవ టూరి సోమన పండితారాధ్య చరిత్రలో పేర్కొనబడిన వాడే. ఈ విషయాన్ని సోమన కాల నిర్ణయం చేసినవా రందరూ అంగీకరించారు. కానీ, వీరంతా పాల్కుర్కి సోముడు పండితారాధ్య చరిత్రను ఈ శాసనకాలానికి తర్వాతి రాసినదిగా భావించినారు. కానీ, ఇది అవ సరం లేదు. క్రీ.శ.1170లో మల్లికార్జునుడు మరణిం చగా పండితారాధ్యుని పుత్రుడు కేదార పండితుడు పీఠమెక్కగా అతని వద్ద దీక్ష తీసుకొన్న ఇవటూరి పండితారాధ్యుడు, పాల్కుర్కి సమకాలికుడై, ప్రసిద్ధుడై పండితా రాధ్య చరిత్ర, పిల్లలమర్రి శాసనములందు పేర్కొనబడుటకు పౌర్వాపర చర్చ అక్కర లేదు. ఉభయులు వృద్ధులే. సమవృద్ధులే. సమకాలికులే. పండితారాధ్య చరిత్ర సోముని ప్రౌఢకాలపు రచన, కనుక పాల్కుర్కి సోమన క్రీ.శ.1170-1240 ప్రాంతాన జీవించి ఉన్నాడు.

డాక్టర్ సంగనభట్ల నరసయ్య
94400 73124

పాల్కుర్కి సోమన ప్రతాపరుద్రునిపై కినిసి, ఓరుగల్లును తురుష్కా క్రాంతం అవుతుందని భవిష్యవాణి (శాపం) చెప్పినట్టు కూడా పిడుపర్తి గ్రంథంలో పేర్కొనబడటం జరిగింది. కనుక ఇవి కల్పిత కథల సమాహారాలు. మహాకవులు తిక్కన, మొల్ల, పాల్కుర్కి ఈ రెండవ ప్రతాపరు ద్రుని అస్థానమునకు వచ్చినట్టు రాసినారు. అవి, అసంగతాలు. కాలౌచిత్యదూరాలు. కనుక ఈ చరిత్ర గ్రంథ కథనాలు తిరస్కరించదగినవి. చరి త్రకు పనికివచ్చే అంశాలు కావివి. ఈ గ్రంథాలను ప్రమాణంగా స్వీకరించలేం. ఈ కవులు పాల్కుర్కి సోమనకు రెండు శతాబ్దులు తర్వాతి వారు. ఈ రెండు కావ్యములు కాకతీయుల చరిత్రకు ఏ మాత్రం సత్యప్రతిష్ఠ చేసేవి కావు. కనుక ఈ గ్రంథాలాధారంగా పాల్కుర్కి సోమనను రెండో ప్రతాపరుద్రుని సమకాలికుడనరాదు.

ఈ విధంగా పాల్కుర్కి సోమన క్రీ.శ. 12వ శతాబ్దివాడుగా నిర్ధారింపవచ్చు. క్రీ.శ.1170-12 50 సోముని కాలంగా (ఒక దశాబ్ది అటుఇటుగా) భావించాలి. మొదట రుద్రుని కాలమున జన్మిం చి, గణపతి దేవుని కాలంలో శివైక్యం చెందినాడ నవచ్చు.

కథలో దూరిన 'జిట్టపులి'!

జిట్టపులి సంకలనంలో ఉన్నవి పన్నెండు కథలు. రచయిత మ్యాకం రవి రాసిన తొలికథ 'యాపచెట్టు'. 2011కి పూర్వం తెలంగాణలో ఉన్న రైతు జీవితాన్ని విజువలైజ్ చేసిన కథ ఇది.

అప్పు పుట్టడం ఒక యుద్ధమైతే, పుట్టిన అప్పును తీర్చడం మరో యుద్ధం. ఆ యుద్ధాల నడుమ రైతు 'కుదవ పెట్టిన జీవితం. కుదురు కోని పాణం'. చెట్టు మనిషికి నీడ మాత్రమే కాదు, ఆపదలో ఆదుకున్న తోడు కూడా అని చెప్పిన కథ ఇది. ఇందులో ఉన్న దాదాపు అన్ని కథలు కొంతమంది కథా రచయితలకు తెలిసినవే అయి ఉంటాయి. వివిధ కథల పోటీల్లో బహుమతులు గెలుచుకోవటం, ఆయా మాధ్య మాల ద్వారా వివిధ సందర్భాల్లో ప్రచురితమయ్యాయి. యాపచెట్టు (2011) నుంచి 'అర్ధరాత్రి ఫోన్‌కాల్' (2024) దాకా కథలన్నీ దేని కవే వస్తువులో, శిల్పంలో ఆఖరికి ముగింపులో ప్రత్యేకమైనవి.

ఇందులోని కథలన్నీ పాఠకుడికి జీవితాన్ని దృశ్యమానం చేస్తాయి. తెలంగాణ మట్టి పొత్తిళ్లు వెదజల్లిన మనిషి సుగంధం ఈ కథల నిండా ఉంది. చదువుతుంటే పాత్రలు మనతో ముచ్చట పెట్టినట్టే అగుపిస్తది. మన భాషను అంతలా అచ్చుగుద్దినట్టు దించిండు రచయిత. మచ్చు కు.. 'ఎదురుచూపులు' కథలో బతుకుదె రువు కోసం బొంబాయికి పోతున్న కొడు కు బస్సెక్కినంక కన్నపేగును సాగనంపు తున్న దైన్యాన్ని ఇలా రాశాడు.. 'డ్రైవర్ కీక పెడ్తుంటే ఆడిని గట్టిగ పట్టుకున్న. పాలు దాగుతున్న దుడ్డెను తలుగుపెట్టి గుంజుతు న్నట్టుగనే నన్నిడిసి బోవట్టిండు'. ఇంతక న్నా బలమైన చిత్రణ ఏం కావాలె? అటు వంటివి కథల నిండా అనేకం.

నూర శ్రీనివాస్

బతుకు ముక్కలు

ఊళ్లె బతుకుదెరువు లేక
ఇయ్యిల గాదు నిన్న గాదు
ముప్పై ఏండ్ల కింద పట్నమొచ్చినం
ఆడీడ ఇండ్లల్ల పనిచేసినం
అప్పుడప్పుడు
కడుపు కట్టుకొని కూలి చేసినం
మా వెంట గిర్క తిరిగినట్లు తిరిగినోల్ల
మాయమాటలు నమ్మి
పల్లెల పగ్గమంత పాలముంటే అమ్మినం
తెలిసో తెలువకనో
గీడ జాగ కొన్నం
మాకేం తెల్సుతది
చెరువు భూమని బఫర్‌జోనని
నాలాలు, శిఖమని, ఎఫ్‌టీఎల్ అని
మాకెవ్వడు చెప్పకపాయె
అమ్మినోడు అమెరికాలో ఉన్నడంట
అనుమతిచ్చినోనికి ప్రమోషనట
వాళ్లిప్పుడేడున్నరో తెల్వదు
ఎవరికి సెప్పాలి
యాడికిపోవాలి
రాత్రికి రాత్రే
బతుకు గూళ్లు కూల్చితే నీడెట్ట
దారెవ్వరు దాపెవ్వరు?
బతుకు ముక్కలేనా?

మార్పు మార్పంటూ
ఇయ్యాల మాట్టాడుతున్నోళ్లందరు
నిన్న, మొన్న, ఆవలి మొన్న
అధికారంల ఉన్నోళ్లె
ఎవలి మీద కక్షతోనో
ఎవలి మీద ప్రేమ తోనో
మా పానాల మీదికి ఎసరొచ్చె
అయ్యా!
జెర మా గోసలిను
ఆడ పొలం వాయె
ఈడ గూడు వాయె
మీకేమో
ఇండ్లు, బంగ్లలు,
కలల మేడలు, ఫారమిండ్లు
మాకేమో
తలదాపులు బతుకు దెరువులు
ఈ పరువు పండెంల
మేం కూలిపోయినం
రోడ్ల వెడల్పుల నష్టపోవాలి
వరదల్ల కొట్టుకపోవాలి
ప్రాజెక్టుల కింద మాయం కావాలి మేమే
ఎవరికీ ఏది తక్కువైనా ఎక్కువైనా
మీ సూపులు గడ్డపారల్లే మా మీదనే

తప్పులు
మీరు సేస్తరు
తిప్పలు మాకంటరు
ఇందిరమ్మ రాజ్యమంటున్నరు
బుల్డోజర్లు తెస్తున్నరు

కూల్చడం నిర్మాణం కాదు
పేదోల్లకు సాయమై నిలబెట్టు
చెరువులు తవ్వు సెలిమెలా నిలబడు
తెప్పలు మీదపడ్డట్టు
మా గుండెలు కూల్చి మీరు నిలబెట్టే
దేంది
మా చేతులతోని ఓట్లేసినందుకేనా
మా కన్నీళ్లు మూటగట్టుకునేది

వనపట్ల సుబ్బయ్య
94927 65358

('హైడ్రా'లో బతుకులు కూలిపోయిన పేదల తరపున..)

దీపం దిక్కూ నీవే!

అపరిచితంగా రాత్రి తోవ తప్పడు అయినప్పుడు
దూరంగా గుడిసె ముందున్న
గూట్లోని నిరాడంబర మిణుకు దీపం
పరిచితంగా పాదాలను సరియైన తోవలోకి తెస్తుంది!
కంటి ముందు దేవదూత అవుతుంది!

దీపం చిన్నది అయితేనేం
పెద్ద లైట్ హౌస్ కన్నా గొప్ప!
దీపం కాంతి దిక్సూచి!

కందాళై రాఘవాచార్య
87905 93638

'నడిరేయి ఏ ఝాములో అని రాశానేంటండి. నడిరేయి అంటేనే ఓ ఝాము అని కదా. మీరూ పట్టుకోలేదు. పాట రికార్డింగ్ కూడా అయిపోయింది. ఇప్పుడెలా..?' అన్నారు దాశరథి కృష్ణమాచారి గారు మాటల రచయిత దీవి నరసరాజు గారితో.

ప్రయోగశీలి దాశరథి

గట్లుంటది..

'రంగులరాట్నం' సినిమా కోసం దాశరథి గారు రాసిన భక్తి పాట అది. పాట రాశాక నిర్మాత బీఎన్ రెడ్డిగారికి వినిపిస్తే ఆయన ఆనందానికి అవధి లేకుండా పోయిందట. 'కవి గారు.. ఈ పాట తెలుగు చిత్రసీమలోనే కాదు, తెలుగు భక్తి గీతాల్లోనే అత్యుత్త మంగా మిగిలిపోతుంది. అద్భుతం' అని ఆనందపడ్డా రట రెడ్డి గారు. తీరా పాట రికార్డ్ అయిపోయి ఆ రికా ర్డింగ్ రూంలో నుంచి బయటకు వస్తూండగా దాశరథి గారికి ఈ అనుమానం వచ్చి కాసింత కంగారు పడుతూ నరసరాజు గారి దగ్గర ఇదిగో ఇలా వాపోయారట. ఆ రచయితా గమనించలేదు. అందరూ పాట బాగా రాశారు. అత్యద్భుతమైన సంగీతం, ఘంట శాల మాస్టారు, జానకమ్మ మా చక్కగా పాడారు అనే ఆనందం లోనే ఉన్నారు కానీ, ఈ పొరపాటు గ్రహించలేదు. దాశరథి గారి భయానుమానాలకు నరసరాజు గారు సమాధానం చెప్తూ 'కవి గారూ.. భక్తి పారవశ్యంలో లాజి క్కులుండవండి. కంగారు పడ కండి. ఇదో సూపర్ సాంగ్‌గా నిలుస్తుంది' అన్నారట. అలాగే నిలిచింది కూడా. ఈ పాట రాయిం చడానికి ముందు 'దాశరథి గారు ఎందుకూ, ఆయన విప్లవ కవి కదా' అని సందేహించారట నిర్మాత, దర్శ కుడు కూడా అయిన బీఎన్ రెడ్డి. అయితే, మళ్లీ దాశరథి గారే తగిన వారని అనిపించి 'సినిమాలో భక్తి పాట మీరే రాయాలి. ఈ ఉద్యమాలు, విప్లవాలు రాకుండా చూసు కోండి. ఆ స్వామిని ఇద్దరు అభాగ్యులు ఆదుకోమంటూ పాడే పాట' అనీ సీన్ కూడా చెప్పారట దాశరథి గారికి. దాశరథి కృష్ణమాచారి గారు ఓ నవ్వు నవ్వేసి పాట రాసే శారు. ఈ నడిరేయి ఏ ఝాము పాటలో తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఆ అభాగ్యుల నోట పాట మధ్యలో 'కల వారినే గాని కరుణించలేడా.. నిరుపేద మొరలేవి విని పించుకోడా' అని పలికించారు దాశరథి. ఈ లైను విన్న బీఎన్ రెడ్డి 'కవి గారు మీరు మామూలు వారు కాదండి' అంటూ ఆనందంగా కౌగలించుకున్నారట కూడా. ఇలాగే భక్తిలో కూడా తన మార్గాన్ని వదలని కవి దాశ రథి కృష్ణమాచార్యులు గారు.

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న దాశరథి విప్లవ గీతాలతో పాటు భక్తి పాటలు కూడా అలవోకగా రాశారు. దీనికి కారణం ఏం లేదు. ఆయన ఇంట్లో భక్తి వాతావరణం ఉండటమే అని ఆయన తమ్ముడు దాశరథి రంగాచారి గారు రాశారు ఆయన జీవనయానం ఆత్మక థలో. నిజానికి ఆస్తికుల కంటే నాస్తికులే భక్తి పాటలు మరింత భక్తితో రాస్తారని ఆరుద్ర ఓ సారి నాతో అన్నారు. ఆరుద్ర కూడా డ్యూయట్ల కంటే భక్తి పాటలే బాగా రాశారనే వారూ ఉన్నారు. దాశరథి గారు రాసిన 'ఆ చల్లని సముద్ర గర్భం... దాచిన బడ బానలమెంతో...' పాటలో ఎంత ఆర్తి, ఆవేశం, ఆగ్రహం ఉంటా యో భక్తి పాటల్లో కూడా అంతే స్థాయిలో ఆధ్యాత్మికత ఉంటుంది.

సినీ పరిశ్రమలో కవులు, రచయితలకు ప్రయోగాలు చేసే అవకాశం ఉండదు. అది కళాత్మక వ్యాపారం. కానీ, తన పాటల్లో ప్రయోగం చేసిన అతి తక్కువ మంది కవుల్లో అగ్రగణ్యుడు దాశరథి గారే. కవిత్వంలో అద్భుత ప్రయో గంగా మిగిలిన ముక్తపదగ్రస్తాన్ని చాలా స్వేచ్ఛగా వాడింది దాశరథి కృష్ణమాచారి గారే. అది కూడా ఓ పల్లెటూరి అమాయకురాలైన అమ్మాయి పాడే పాట 'గోదారి గట్టుంది/ గట్టుమీన చెట్టుంది/ చెట్టు కొమ్మన పిట్టుంది' అంటూ చివరి మాటను రెండో పదానికి తొలి మాటగా ప్రయోగించే ఈ ముక్త పద గ్రస్తం ప్రయోగాన్ని సినీ మాధ్యమం కోసం వాడిన ధీశాలి కవి దాశరథి గారే.

సినిమా ప్రవేశానికి ముందు తెలంగాణ సాయుధ పోరాటంలో స్వయంగా పాల్గొన్న దాశరథి కృష్ణమాచారి గారిని నిజాం ప్రభుత్వం నిజామాబాద్ జిల్లాలోని ఇందూరు ఖిల్లాలో ఉన్న పురాతన జైలులో ఖైదు చేసింది. ఆ జైలు గోడల మీద రాసుకున్న కవిత్వం ఎన్ని దశాబ్దాలు గడి చినా నూతనత్వంతో ఉండటమే దాశరథి గొప్పతనం. నిజాం పాలనకు వ్యతిరేకంగా దాశరథి రాసిన కవిత్వం ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ ఉద్యమాలకు దారి చూపింది.

'కోటి తెలుగుల బంగారు కొండ క్రింద పరచుకొన్నటి సరసులోపల వసించి ప్రొద్దు ప్రొద్దున్న అందాల పూలు పూయు నా తెలంగాణ తల్లి... కంజాత వల్లి'

అన్నారు దాశరథి. తెలంగాణలో ఆనాటి పోరాటాన్నే కాదు, ప్రకృతిని ఇలా వర్ణిస్తూ 'తెలంగాణ తల్లి.. తామర పూల వంటిది' అన్నారు. ఈ తామర పూలు దాశరథి కృష్ణమాచారిని, ఆయన తమ్ముడు రంగాచారిని కూడా వదలలేదు. ఈ అన్నదమ్ములు పుట్టిన చిన గూడూరు ఊరు చివర చెరువులో ఉన్న తామరపూలను రంగాచారి తన జీవనయానం ఆత్మకథలో చాలా అద్భుతంగా వర్ణించారు. ఆ తామరపూలు ఈ ఇద్దరన్నదమ్ముల రచనల్లోనూ స్థానం కల్పించుకున్నాయంటే ఆ చెరువు, అందు లోని తామరపూలు వారిద్దరి జీవితాలను ఎంత ప్రభావితం చేశాయో అనిపిస్తుంది.

ముక్కామల చక్రధర్
99120 19929

తెలంగాణ కోటి రతనాల వీణలో ఓ రత్నంలా వొదిగి, తెలంగాణ సమాజం తలెత్తుకునేలా చేసిన కవి దాశరథి.

మారని కాలం

ఉనికే
ప్రశ్నార్థకమైన చోట
రాళ్లను చీల్చుకొని ఎదగడమే సాహసం!

నీళ్లే కరువైన చోట
కన్నీళ్లు తాగి విస్తరించడమే
ఒక చరిత్ర!

ఇవ్వాళ
నా నీడ ఒక ఆకుపచ్చని జాడ
కాగితం మీద కట్టిన అక్షరాల మేడ!

ఎవరు
ఎదురుపడినా ఎగాదిగా చూసినా
ఒకింత గర్వం ఒకింత ఆనందం!

తల్లిలా ఆదరిస్తే
ఒకని కన్ను
నేను దాచుకున్న తేనె పట్టు పై!

నీడనిచ్చి ప్రేమిస్తే
మరొకని చేతిలో నూరిన గొడ్డలి
మొదటికే మోసం!

కవీ
కాలం మారింది అనడం
అబద్ధం శుద్ధ అబద్ధం!!

కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261



గ్రంథాలయం...

ఈ మధ్య మా ఊళ్ళో
ఓ పుణ్యాత్ముడు
ఒక చెరువు తవ్వించాడు
ఎగువన కురిసిన వర్షానికి
వచ్చే నీళ్ళలా
ఎక్కడెక్కణ్ణుంచో పుస్తకాలు
జలజలా ప్రవహించి
ఆ తటాకపు అల(ల)మారల్లో
కనువిందు చేస్తున్నాయి
ఇప్పటివరకూ
తెలిసో తెలియకో
చెరువు మీద అలిగి
అజ్ఞానపు బురద అంటించుకున్న
ప్రతి ఒక్కడూ
రేపు ఈ రేవుకొచ్చి
కాళ్ళు కడుక్కోకా తప్పదు
పుస్తకాన్ని
తన కళ్ళకు అద్దుకోకా తప్పదు...

నలిమెల భాస్కర్